క్లుప్తంగా

రైతులను అప్రమత్తం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ గిరీష్‌కుమార్

కోడుమూరు రూరల్ : రబీ కింద రైతులు సాగు చేసిన పంటలను గమనించి, వాటిని ఆశించే చీడపీడలు, తెగుళ్లపై రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాల సిబ్బందిపై ఉందని డీఆర్సీ ఏడీఏ గిరీష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం గూడూరులోని వ్యవసాయ కార్యాలయంలో రబీ పంటల సాగు– తెగుళ్లపై గూడూరు, సి.బెళగల్ మండలాల వ్యవసాయ సిబ్బందికి డీఆర్సీ ఏడీఏ గిరీష్‌కుమార్, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి అవగాహన కల్పించారు. ఏడీఏ గిరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్నకు కత్తెర పురుగు వేగంగా సోకుతోందని, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ సిబ్బంది తమకు కేటాయించిన విధులపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా రబీ పంటల నమోదును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గూడూరు, సి.బెళగల్‌మండలాల ఏఓలు శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లేష్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలమ్మ

కోడుమూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మలమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం కోడుమూరులోని సుందరయ్య భవన్‌లో సీపీఎం మండల 3వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 6నెలలు గడిచినా అమలు చేయకుండా కరెంట్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని విమర్శించారు. అనంతరం మహాసభలో సీపీఎం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాజు, కమిటీ సభ్యులుగా వీరన్న, గఫూర్ మియ్యా, జీపీ వీరన్న, మనోహన్, లక్ష్మన్న, గంగాధర్, బాబయ్య, మద్దిలేటి, అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



మన్‌మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాటసాని, నాయకులు

కల్లూరు: దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్వగృహం నుంచి కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన ర్యాలీకి ముందుగా మన్మోహన్ సింగ్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి కాటసాని సంతాపం తెలిపారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కాటసాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని క్యాంపు సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల ఆధునీకరణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీలక్ష్మీనగర్, ఆరోరానగర్, టెలికాం నగర్, కమలా నగర్, డాక్టర్స్ కాలనీ, గఫూర్ నగర్, సోమప్ప కాలనీ, బీ క్యాంపు, పోస్టాఫీసు సర్కిల్, మహాలక్ష్మి నగర్, జేసీ బంగ్లా, అమ్మ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 29 నుంచి చెన్నై నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అశిష్ సుహాస్, మనోజ్‌కుమార్, జెస్సికా, జయశ్రీలను శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అభినందించి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్యా, అధ్యక్షులు నాగేశ్వర బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు గీతాంజలి, సుభాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాబూ... ఏంటీ బాదుడు!

- కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ గళమెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- కదంతొక్కిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఎస్‌ఈ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని



ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కల్లూరు: కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు గళమెత్తారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు... సీఎం చంద్రబాబూ... ఏంటీ బాదుడు అంటూ కదం తొక్కారు. కాటసాని స్థానిక స్వగృహం నుంచి ప్రారంభమైన భారీ నిరసన ర్యాలీ బళ్లారి చౌరస్తా మీదుగా విద్యుత్ భవన్ వరకు సాగింది. కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి... ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని నినదించారు. అనంతరం నాయకులతో కలిసి ఎస్‌ఈ ఉమాపతికి మాజీ ఎమ్మెల్యే కాటసాని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. ఎన్నికలో గెలవడం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేశారని, ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టారని విమర్శించారు. కుట్రలు, కుతంత్రాలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు, విద్యుత్ చార్జీలు పెంచి తన నైజాన్ని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచార సభలలో విద్యుత్ చార్జీలు పెంచనని బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత చంద్రబాబే దక్కించుకున్నారని ధ్వజమెత్తారు. కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలతో కర్నూలు జిల్లాలోనే రూ. 25 కోట్ల భారం పడుతుందన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరిగి అల్లాడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల మోత బాదడం సమంజసమా అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెరగడంతో సామాన్య ప్రజలతోపాటు చిన్న పరిశ్రమలు యాజమాన్యాలకు దిక్కుతోచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేయాలని ఆలోచన బాబుకు లేదని, పింఛన్ పెంచామంటూ గొప్పలు చెప్పుకుంటున్న నేతలు సర్వేల పేరుతో తొలగింపునకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

అధిక ధరలకు బాబు ఒప్పందం

2014–2019 మధ్య కాలంలో అధికారంలో ఉండగా అవసరం లేకపోయినా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లను అధిక ధరలకు అప్పటి సీఎం చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్నారని కాటసాని విమర్శించారు. 2,500 మెగావాట్ల సోలార్ విద్యుత్ కోసం 35 పీపీఏలు చేసుకున్నారన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో చంద్రబాబు ప్రభుత్వం 2,400 మెగావాట్ల కోసం చేసుకున్న ఒప్పందం సాధారణ ధర రూ. 5.90 కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేవలం రూ. 2.49 అన్నారు. అంటే చంద్రబాబు హయాంలో కన్నా రూ. 3.41 తక్కువ అవుతుందన్నారు. అలాగే డిస్కంలను అప్పుల్లోకి నెట్టిన ఘనత చంద్రబాబదేనన్నారు. 2014 నాటికి రూ. 29వేల కోట్లు అప్పులు, బకాయిలు ఉండగా ఆయన దిగిపోయే నాటకి (2019) ఏకంగా రూ. 86వేల కోట్లకు చేరిందన్నారు. దాదాపుగా 23.88శాతం వార్షిక అప్పు పెరుగుదలతో చంద్రబాబు హయాంలో డిస్కంల పరిస్థితి దయనీయంగా ఉండేదన్నారు. ఆ డిస్కంలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 47, 800 కోట్లు అందించిందని ఈ సందర్భంగా కాటసాని గుర్తు చేశారు.

బాబూ...సూపర్ సిక్స్ అమలు ఏదీ?

సీఎం పీఠం ఎక్కడమే లక్ష్యంగా గత ఎన్నికల్లో చంద్రబాబు హామీలు గుప్పించారని, గద్దెనెక్కాక మాయ మాటలతో మభ్యపెడుతూ తన నైజాన్ని నిరూపించుకున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని ఎద్దేవా చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తాం.. వైఎస్సార్‌సీపీ కంటే మెరుగైన సేవలు అందజేస్తాం... వలంటీర్ సేవలు కొనసాగిస్తాం... సూపర్ సిక్స్ పథకాలతో మీ జీవితాను మార్చుతాం అంటూ మభ్యపెట్టిన బాబు ఆరు నెలల్లో ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలన విస్మరించిన బాబు వెంటనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై బాదుడు మొదలెట్టారని ధ్వజమెత్తారు. ప్రజలపై ఏ భారం మోపినా సహించమని, వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలదీస్తుందన్నారు. పెంచి విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే కూటమి సర్కార్ పతనం తప్పదని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామిలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. తల్లికి వందనం అని ముందుగా నాన్నకు ఇందనం ఇస్తున్నారన్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు, ఎంపీపీలు తిప్పన్న, హుస్సేన్‌బీ, జెడ్పీటీసీలు రంఘనాథ్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, కల్లూరు మండల కన్వీనర్ ఈశ్వరయ్య, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, వైఎస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన వైఎస్సార్‌సీపీ పోరుబాట

- కోడుమూరు కోట్ల సర్కిల్ నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు
- కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్

కోడుమూరు రూరల్ : కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట హోరెత్తింది. విద్యుత్ చార్జీల బాదుడును నిరసిస్తూ కోడుమూరులోని కోట్ల సర్కిల్ నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. ప్రజలనుద్దేశించి డాక్టర్ సతీష్ మాట్లాడుతూ అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు పెంచం..పైగా తగ్గిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అబద్ధమని తేలిపోయిందన్నారు. 6నెలల్లోనే చంద్రబాబు మోసాలు బయట పడ్డాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా దుర్మార్గంగా విద్యుత్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శించారు. జగనన్న తన 6నెలల పాలనలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చి తనను నమ్మిన ప్రతి కుటుంబానికి హామీల లబ్ధిని సంపూర్ణంగా అందజేశారన్నారు. అయితే చంద్రబాబు అధికారంలోకొచ్చిన 6నెలల్లోనే ఇచ్చిన హామీలన్ని బూటకపు హామీలని, కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు అపద్ధపు హామీలిచ్చి మోసం చేశారని ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. సంపద సృష్టి అంటే ప్రజలపై పన్నుల పేరుతో బాదుడు చేపట్టడమే నానని ప్రశ్నించారు.



కోడుమూరు ట్రాన్స్‌కో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ట్రాన్స్‌కో ఏఈ మధుసూదన్‌కు వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ సతీష్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ చార్జీలు

కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ సునీత మాట్లాడుతూ అధికారంలోకొచ్చిన కూటమి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15వేల కోట్ల మేర కరెంట్ చార్జీలను పెంచి పేదల నడ్డి విరుస్తోందని ధ్వజమెత్తారు. ప్రతి మహిళకు రూ.1,500, తల్లికి వందనం లేదు, సూపర్ సిక్స్ పథకాల అమలు సరిగా లేదన్నారు. ఇదేమని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు, ఇలాంటి అరాచక పాలనను ఎన్నడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలకు ప్రజలు బలైపోతున్నారని, ప్రజల తరపున ప్రభుత్వంపై పోరాడేందుకు ఎల్లవేళాలా వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంటుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం నాయకులు బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేకపోతే ప్రజలతో కలిసి తాము మునుముందు మరింత ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కర్నూలు, గూడూరు జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, మండల ఉపాధ్యక్షులు నెహమియ్యా, సర్పంచులు పాండురంగన్న, గోపాల్, సాగర్, ఉపసర్పంచు మాదులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు డి.వాసు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు క్రిష్టారెడ్డి, వినయ్ రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, మండల కన్వీనర్లు రమేష్ నాయుడు, సోమశేఖరరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, రవికుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహానంది, హరున్, మద్దిలేటి, వెంకటేష్, లింగన్న, రాఘవేంద్ర, దుబ్బన్న, ఎస్ఎం బాషా, నరసింహారెడ్డి, సత్యారెడ్డి, లింగమూర్తి, వెంకటేష్, ఏకాంబరం, లక్ష్మన్న, జగదీష్, విష్ణుదాస్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వార్డుమెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

శనగ సంరక్షణకు చర్యలు తీసుకోండి



పోలకల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంటల సంరక్షణకు రైతాంగం చర్యలు తీసుకోవాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మండలంలోని పోలకల్ గ్రామంలో సాగు చేసిన పంటలను కర్నూలు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ గిరీష్, ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. శనగలో ఎండు తెగులు, తుప్పు తెగులు, బూడిద తెగుల లక్షణాలను గమనించిన ఏడీఏ నివారణకు ససర్యక్షణ పద్ధతులను రైతులకు సూచించారు. లీటరు నీటిలో రెండు మిల్లీలీటర్ల కాంటాఫ్ ద్రావణం లేదా, లీటరు నీటికి మూడు గ్రాముల కార్బెండేజిం, లేదా 13.0.45 లేదా 19.19.19 మందులను ఎకరాకు ఒక కేజీ చొప్పున నీటిలో కలిపి శనగ పైరుపై పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా జొన్న, మొక్క జొన్న పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లడుతున్న స్పెషల్ ఆఫీసర్ వెంకటేశులు

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ వెంకటేశులు తెలిపారు. మండల పరిధిలో నిడ్జూరు గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమానికి హాజరైన స్పెషల్ ఆఫీసర్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందజేసిన వినతికి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. వివిధ భూసమస్యలపై రైతుల నుంచి 12 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, వీఆర్వో మద్దిలేటి, సర్వేయర్ మహిధర్, వీఆర్‌ఏలు తదియితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన రెవెన్యూ సదస్సు

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి ఆదరణ కరువవుతుంది. శుక్రవారం మండలంలోని శకునాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రీసర్వే డిప్యూటి తహసీల్దార్ షర్మిలరెడ్డి, కాల్వబుగ్గ ఈఓ మద్దిలేటి, వీఆర్ఓ వెంకటరావు హాజరయ్యారు. దీంతో వేదికపై ఇద్దరు అధికారులు మాత్రమే ఆశీనులు అయ్యారు. రైతులు సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక, కొద్ది సేపు ఉండి నిరుత్సాహంతో వెనుతిరిగి పోయారు. ప్రజల నుంచి స్పందన లేక పోవడంతో సదస్సు బోసిపోయింది. కేవలం ఎనిమిది మంది రైతులు మాత్రం అధికారులకు వినతులు సమర్పించారు.

బడ్జెట్‌పై అవగాహన

కర్నూలు(సెంట్రల్): విద్యార్థి దశ నుంచే ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలని కర్నూలు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు సూచించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వివిధ డిపాజిట్ ఖాతాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యూబీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌యూ గణిత శాస్త్రం హెచ్‌ఓడీ రవికుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా కాటసాని జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్, పాణ్యం, గడివేములు, ఓర్వకల్లు, కల్లూరు గ్రామీణ మండలాల నుంచి నాయకులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాటసానికి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, బెల్లం మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఈ కేవైసీని చేయించుకోవాలి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని ప్రాథమిక పరపతి వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఖాతాదారులుగా ఉన్న రైతులు సచివాలయాల్లో ఈ కేవైసీని చేయించుకోవాలని సీఈఓ రవి కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కేవైసీ చేయించుకోకపోతే సహకార సంఘం ఎన్నికలలో ఓటు హక్కును సైతం కోల్పోతారన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కోడుమూరు రూరల్ : కోడుమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు ఆయా గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మికాంతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదా రులు ఈకేవైసీ చేయించుకుంటేనే ఓటు హక్కు ఉండడంతో పాటు, ప్రభుత్వం తరపున వచ్చే రాయితీలు, సున్నా వడ్డీ రుణాలు, పంటల కొనుగోలు, ఎరువులు లభిస్తాయన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- నంద్యాల డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గడివేముల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం గడివే ముల పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అలజనులు సష్టించినా పోలీసుకలు సమాచారం అందజేయాలన్నారు. రాజ్యాంగ సవరణల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సమాజంలో వివక్షకు గురికాకుండా వాటిని ఉపయోగించుకుని, తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. కులమత బేధాలకు పోకుండా అందరూ సమానంగా జీవించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనుమానితుల ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, లేని పక్షంలో పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్ : దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం కోడుమూరులో ఇంచార్జ్ డా.ఆదిమూలపు సతీష్ కోడుమూరు, గూడూరు, కర్నూలు మండలాల జెడ్పీటీసీలు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, ఎంపీపీ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలి సి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు ఆదిమూలపు సతీష్ గుర్తు చేశారు. కోడుమూరు, సి.బెళగల్ మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రమేష్‌నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మి నరసింహయాదవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అన్నారు.

సంతాపం

కర్నూలు(రూరల్): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధకరమని ఎంపీ బస్తిపాటి నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ దేశానికి ఎనలేని సేవలు చేశారని, దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P.No: 52/2024

వడ్ల రాజశేఖర్ ..అర్జీదారు
-VS-
కె.జయరామ్ వగైరా ..రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కోడుమూరు మండలం, కోడుమూరు గ్రామము ప్రజలకు తెలియజేయడము ఏమనగా పై నెంబర్ I.P.లో అర్జీదారు అయిన వడ్ల రాజశేఖర్ తండ్రి లేటు వడ్ల సుబ్రమణ్యం ఇ.నెం: 17-81, కుమ్మరి వీధి, మెయిన్ బజార్, కోడుమూరు, కర్నూలు జిల్లా. అనునతడు తనను దివాలా దారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాలా అర్జీ (I.P) దాఖలు చేసినాడు. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 07.01.2025 తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టు నందు హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

షేక్ నజీర్ అహ్మద్, షేక్ మస్తాన్ వలి, షేక్ షఫీ
అర్జీదారు పరం అడ్వకేట్లు, కర్నూలు.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

కోడుమూరు రూరల్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని, తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలని గూడూరు సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులో ఈనెల 29,30వ తేదీల్లో జరిగే సీపీఎం 23వ జిల్లా మహాసభల పోస్టర్లను శుక్రవారం గూడూరులో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు జిల్లా వాసులకు ఇచ్చిన హామీ మేరకు గుండ్రేవుల ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. గూడూరులో నిలిచిపోయిన నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీటినందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజశేఖర్, దానమన్న, మునెప్ప, కొమ్మురాజు, చిన్న రాజు, మహిళ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరులో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో ఎగ్గొని వెంకటసుబ్బయ్య ఇంట్లో చోరీ జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున రూ. 50వేలతోపాటు 5తులాల బంగారం దోచుకెళ్లినట్లు ఎగ్గొని వెంకటసుబ్బయ్య గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గ్రామానికి చేరుకున్న పోలీసులు విచారిస్తున్నారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరిస్తున్నట్లు సమాచారం.